# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 313 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 10 జూలై 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ

**దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు**

**తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు**

**హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు**

**ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూలై9 (నమస్తే ఉదయం) :**

2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగు తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.





సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదు-పాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ. ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల ..మిగతా 2లో



# వ్యవసాయ రంగానికి పెద్దపీట

**రెండున్నరేళ్లలోనే 35వేల కోట్లు రైతులకు అందచేత**

**రైఊతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాం**

**బిఆర్ఎస్ పాలనలో క్రాప్ డ్యామేజ్‌కు కెసిఆర్ ఒక్క పైసా ఇవ్వలేదు**

**ఖమ్మం పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**

**ఖమ్మం,జూలై9 (నమస్తే ఉదయం) :**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాథపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ..మిగతా 2లో

**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్**

# తొలిదశ పనులకు అనుమతులు

**రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు**



**హైదరాబాద్,జూలై9 (నమస్తే ఉదయం) :**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్-1ఏ, జోన్-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ..మిగతా 2లో

# ఎల్‌నినోపై కార్యాచరణ చేపడతున్నాం



**హరీష్ రావుపై కెసిఆర్‌కు నమ్మకం లేదు**

**అందుకే మంత్రి పదవికి దూరం పెట్టారు**

**సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్,జూలై9 (నమస్తే ఉదయం) :**

ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్‌రావుకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీలో డ్యామేజీల మరమ్మతులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరుతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా తాము సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లాల వారీగా కార్యాచరణకు మంత్రి ఆదేశాలు జారీ ..మిగతా 2లో

**బండి భగీరథ్‌కు**

# షరతులతో కూడిన బెయిల్

**దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్,జూలై9 (నమస్తే ఉదయం) :**



కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో ..మిగతా 2లో

# బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో రూ.1,400 కోట్లు

**అమరుల కుటుంబాలకు పంచి నిజాయితీ చాటాలి**

**టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్**



**భద్రాద్రికొత్తగూడెం,జూలై9 (నమస్తే ఉదయం) :**

బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ.1,400 కోట్లు అమరుల కుటుంబాలకు పంచాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆ డబ్బు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చింది కాదా?అని ప్రశ్నించారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెంలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మా పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా ఫిర్యాదులు ..మిగతా 2లో



# ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

**లైంగిక వేధింపుల కేసు**

**దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు**

**కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశం**

**వాషింగ్టన్,జూలై9 (నమస్తే ఉదయం) :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో న్యాయపరమైన ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధిపుల కేసులో ట్రంప్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు దోషిగా తేల్చింది. రచయిత్రి, మాజీ కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు రూ.47 కోట్లు చెల్లించాలని అమెరికా ఫెడరల్ కోర్టు ..మిగతా 2లో



**యూపిఎ హయాంలో**

# కేటాయింపు అవాస్తవం

**తాడిచర్ల-2 కేటాయింపు కిషన్ రెడ్డి కృషి ఫలితమే**

**భట్టి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే పాయల శంకర్**

**న్యూఢిల్లీ,జూలై9 (నమస్తే ఉదయం) :**

తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌అన్నారు. యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాడిచర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించలేకపోయిందని ..మిగతా 2లో

# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ

మొదటి పేజీ తరువాయి...

అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరమని సీఎం అభిప్రాయ పడ్డారు. యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం కావడం



సంతోషకరమని పేర్కొన్న సీఎం.. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు నిర్మించి అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు చేసిన త్యాగాల వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని సీఎం కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సీతారాంపూర్‌లో నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి త్వరలో మరోసారి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల సహకారంతో తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# వ్యవసాయ రంగానికి పెద్దపీట

మొదటి పేజీ తరువాయి...

ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా రైతు మేళాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, జిల్లా కలెక్టర్ దివాకరతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించడమే ఈ మెగా రైతు మేళా ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. మెగా రైతు మేళా ప్రాంగణంలోనే శు క్రవారం మధ్యాహ్నం రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ అభివృద్ధి చర్యలపై సీఎం రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై




భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ, కడెం వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ బలంగా ఉన్నాయని, బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టుల పరిస్థితి రాష్ట్ర ప్రజలకు తెలిసిందేనని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాకు గత ప్రభుత్వాలు తగిన నీటి వనరులు అందించలేదని, ఆ విషయాన్ని చరిత్రతో సహా నిరూపిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రజలను మాటలతో మోసం చేసే పార్టీ అని, 2023 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలు జిల్లాల పర్యటనలు చేస్తూ విమర్శలు చేస్తున్నప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతోందని, రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటలు, ఆరుతడి పంటలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఆ నీరు ఇవాళ లేదా రేపటిలోగా వైరా రిజర్వాయర్‌కు చేరుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరడంతో రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి, కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిస్థాయిలో లేకపోయినా రైతుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కేంద్రం నుంచి అవసరమైన ఎరువులు సాధించామని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు టెక్నాలజీ వినియోగిస్తూ యాప్ ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే వర్షాల సమాచారాన్ని కూడా సాంకేతికత ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నామని వెల్లడించారు. సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం పనిచేయడం లేదని విమర్శించే వారికి లెక్కలతో సహా సమాధానం చెబుతామని అన్నారు. రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని, రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటోందన్నారు.



## ఉలిగేపల్లిలో యువకుడు దారుణ హత్య

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 9(నమస్తే ఉదయం)**





పొలం వద్ద నిద్రిస్తున్న ఓ యువకుడు దారుణంగా హత్య చేసిమ సంఘటన మల్దకల్ మండలం ఉల్లిగేపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.ఉలిగేపల్లి గ్రామానికి చెందిన బోయ గోవిందమ్మ గోవిందుల పెద్ద కుమారుడైన బోయ మహేష్(24) ప్రతిరోజూ రాత్రి వేళల్లో గ్రామ శివారులో ఉన్న పొలం వద్ద ఉన్న గుడిసెలోనే నిద్రించేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పొలానికి వెళ్లాడు. అయితే, గురువారం తెల్లవారుజామున కుటుంబ సభ్యుల్లో ఒకరు పొలం వద్దకు వెళ్లి చూసేసరికి, మహేష్ తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్నాడు.రక్తపు మడుగులో ఉన్న మహేష్ ను కుటుంబ సభ్యులు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలోనే మహేష్ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహేష్ మృతికి ప్రేమ వ్యవహారమే అయిండొచ్చు అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులువిషయం తెలుసుకున్న గద్వాల సీఐ టి.శ్రీను, మల్దకల్ ఎస్ఐ శ్రీహరి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. "హత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. మృతుడి సెల్‌ఫోన్ డేటా, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తున్నాం. నిందితులను త్వరలోనే గుర్తించి, అరెస్ట్ చేస్తాం అని గద్వాల సీఐ టి.శ్రీను తెలిపారు.

**ఆర్మీకి ఎంపికైనా దక్కని ప్రాణం:**

మృతుడు బోయ మహేష్ ఇటీవలనే ఇండియన్ ఆర్మీకి ఎంపికయ్యాడని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తెలిపారు. అయితే ఇటీవల జరిగిన ఒక గాయం కారణంగా ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటూ, కుటుంబానికి ఆసరాగా వ్యవసాయ పనులు చూసుకుంటున్నాడు. ఎవరితోనూ ఎలాంటి శత్రుత్వం లేని తమ కుమారుడిని ఇంత దారుణంగా పొట్టనబెట్టుకున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

మొదటి పేజీ తరువాయి...

తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉ ంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉ త్తర్వులు జారీ చేసింది.



## బాలానగర్ డివిజన్‌లో ఉచిత కుట్టు మెషిన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

**శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి**

**కూకట్ పల్లి, జూలై 9 (నమస్తే ఉదయం)**

మహిళలు ఆర్థిక రంగంలో ఎదగాలంటే స్వయం ఉపాధిని ఎంచుకోవాలని బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తమ సొంత నిధులతో ఆడపడుచుల స్వయం ఉపాధి కోసం రాజు కాలనీలోని గాంధీబొమ్మ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత కుట్టు మెషిన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, అక్కడ కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వారికి అందుతున్న శిక్షణ వివరాలను తెలుసుకుని, నిర్వాహకులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ శిక్షణను పూర్తిచేసిన ప్రతి మహిళకు సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా కుట్టు మెషిన్ అందజేయడం జరుగుతుందని, అలాగే వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూడా ప్రత్యేకంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణను పూర్తిగా నేర్చుకొని, ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళల సాధికారత, ఉపాధి కల్పనే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో రూ.1,400 కోట్లు

మొదటి పేజీ తరువాయి...

ఇచ్చారు. టీఆర్ఎస్ పేరు నాకు రాకుండా కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి నీతినియమాలు అంటూ ఏమీ లేవా? తల్లి, చెల్లి అనే సభ్యత మరిచి పార్టీ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. నా కంఠంలో ప్రాణముండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లను. నా పోరాటాలు ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, భాజపా చేతులు కలిపాయని ఆరోపించారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రోకో కింద కేటీఆర్ అక్రమ పర్మిషన్లు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్‌రావు అనకొండ. బీఆర్ఎస్ పార్టీ ఇంకా ఆయన్నే ముందు పెడుతోంది. ఆ పార్టీ ఈ జన్మలో బాగుపడదు.. అధికారంలోకి రాదు. పెద్దాయనకు మరకలు అంటించిన ఆయనకు 3 నెలలు మంత్రి పదవి కావాలంట. కేటీఆర్ ఇటీవల రూ.188 కోట్లతో ఓ ఇంగ్లిష్ పత్రిక కొన్నారు. ఫీనిక్స్ సంస్థకు రూ.80వేల కోట్ల విలువైన భూముల కట్టబెట్టారు. ఆ సంస్థ రూ.33 లక్షల టన్నుల కలప కొట్టేస్తోందని కవిత ఆరోపించారు.



## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు అనుమతులు

మొదటి పేజీ తరువాయి...

ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా..మిగతా .2,845.12 కోట్లు ఊఓఆం లేదా ఃఉఎఎఅ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ (ఇఖఅ) విధానంలో నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(ఖఓఅ) నియామకానికి సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్(ఓఖీఆఅఒ) కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## యూపిఎ హయాంలో కేటాయింపు అవాస్తవం

మొదటి పేజీ తరువాయి...

విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాల తో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి...



ఆదేశించింది. 2023లో విచారణ జరిపిన జ్యూరీ, ట్రంప్ లైంగిక దాడికి పాల్పడినట్లు, అనంతరం క్యారల్ పరువును దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినట్లు తేల్చింది. దీంతో 5 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని అప్పుడే తీర్పు వెలువరించింది. లైంగిక దాడికి గాను 2 మిలియన్ డాలర్లు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు గాను 3 మిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ మే 2023లో కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ట్రంప్ చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. 1996లో న్యూయార్క్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూమ్‌లో తనపై ట్రంప్ లైంగిక దాడి చేశారని క్యారల్ ఆరోపించారు. ఆ విషయాన్ని 2019లో ప్రచురితమైన ఓ పుస్తకంలో క్యారల్ రాశారు. ఆ ఆరోపణలు పూర్తిగా కల్పితమని, క్యారల్ ఒక పిచ్చిదని ట్రంప్ కొట్టిపడేశారు. కాగా, ఇది ట్రంప్‌నకు సంబంధించిన ఏకైక సివిల్ కేసు కాదు. 2024లో పరువు నష్టం కేసులో క్యారల్‌కు అదనంగా 83.3 మిలియన్ డాలర్లు చెల్లించాలని మరో జ్యూరీ తీర్పు ఇచ్చింది. ఆ కేసు కూడా ప్రస్తుతం న్యాయపరమైన పక్రియలో కొనసాగుతోంది.

## ఎల్‌నినోపై కార్యాచరణ చేపడతున్నాం

మొదటి పేజీ తరువాయి...

చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి పరిస్థితినీ ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు. గ్రామసభల ద్వారా ఎల్‌నినోపై చైతన్యం కల్పిస్తామన్నారు. శాస్త్రవేత్తల సూచనలతో పంటల ఎంపిక చేసుకోవాలని, ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ల నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగునీటి వినియోగం శాస్త్రీయంగా నిర్వహిస్తామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో నిరంతరం సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వదంతులను నమ్మొద్దని.. అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్చువల్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు.

# నిషేధిత డ్రగ్స్ కలిగి ఉన్న ఇంటిపై దాడి

## ఐదుగురి అరెస్ట్.. ఇద్దరు పరారీ

**బుద్వేల్, జూలై 9 (నమస్తే ఉదయం) :**

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ న్యూ జలాల్ బాబానగర్ లోని ఓ గది లో ఆల్ఫాజోలామ్ వంటి నిషేధిత నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాలను కలిగి ఉండటం, విక్రయాలకు ఉంచడం గురించి తెలుసుకున్న పోలీసులు గురువారం దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు తో సంబంధం ఉన్న ఏడుగురిలో ఐదుమందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 6.65 గ్రాముల ఎండీఎంఏ, ఐదు హైటర్ ఎమ్ మెఫెంటర్మేన్ సల్ఫేట్ ఇంజక్షన్లు, ఐదు ఆల్ఫా జోలామ్ టాబ్లెట్ల సాచెట్లు, రెండు ఉపయోగించని సిరంజీలు, ఒక ప్యాకెట్ పేపర్ గ్లాస్ టిప్స్, ఒక కత్తి, ఐదు మొబైల్ ఫోన్లు, రూ. 16,930లు, ఖాళీ నలుపురంగు క్యారీ బ్యాగు ఒకటిని స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత డ్రగ్స్ అమ్మగా వచ్చిన డబ్బుతో విలాసవంతమైన జీవితం గడపడానికి వీరు ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుతో సంబందం ఉన్న దారుల్ ఉల్ షిఫా నివాసి, డ్రగ్స్ సరఫరదారుడు బాకర్తో పాటు



నిషేధిత డ్రగ్స్ విక్రయాలు చేసే నిందితులను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు

ముజాహిద్ అనే నేరస్థుడు పరారీలో ఉన్నారు. అత్తాపూర్ ఖయ్యూమ్నగర్ కు చెందిన పాత నేరస్థుడు సయ్యద్ అబుల్ హసన్ (34) , ఖయ్యూమ్నగర్ కు చెందిన సైఫ్ అలీ మీర్జా (21) , ఖయ్యూమ్నగర్ కు చెందిన అహ్మద్ హుస్సేన్ (24) , భూపాల్నగర్ కు చెందిన షేక్ అయూబ్ (27) , యాకుత్పూర కు చెందిన డ్రగ్స్ వినియోగదారుడు దుబాయ్ లో పనిచేసే మీర్ షబ్బీర్ అలీ అలియాస్ షబ్బీర్ (38) లను


స్వాధీనం చేసుకున్న డ్రగ్స్

అరెస్ట్ చేశారు. మత్తు పదార్థాలను విక్రయించి వచ్చిన డబ్బులతో విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి నిందితులు ఈ నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు గుర్తించారు. ఏ2 గా ఉన్న సయ్యద్ అబుల్ హసన్ పై 12 కేసులు, సైఫ్ అలీ మీర్జా పై ఐదు కేసులు, తప్పించుకుని పారిపోయి న ముజాహిద్ పై రెండు కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.




# శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## హైదర్గూడ లోఘనంగా శ్రీనల్లపోచమ్మ దేవాలయ మహాకుంభాభిషేకం..

## వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,జులై09(నమస్తే ఉదయం)**

నల్లపోచమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని హైదర్ గూడ ఎర్రబోడలో వెలసిన శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవాలయ పునఃప్రతిష్ఠ,మహాకుంభాభిషేక మహోత్సవం,అత్యంత భక్తిశ్రద్ధలతో,వైభవంగా జరిగింది.ఈ పవిత్ర కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి,అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆదిలాబాద్ కు చెందిన శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం 10వ మఠాధిపతి శ్రీయోగానంద సరస్వతి స్వామిజీ వారి కరకమలములచే అమ్మవారి యంత్ర ప్రతిష్ఠ,ప్రాణ ప్రతిష్ఠ,శాంతి పౌష్టికమంత్ర హవనములు తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి.ఉదయం జరిగిన ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక నాయకులు,అధిక సంఖ్యలో భక్తజనం పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అమ్మవారి కరుణ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని వివరించారు.శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి,ఎన్.మల్లారెడ్డి, పోరెడ్డి ధర్మారెడ్డి,సామ ఇంద్రపాల్ రెడ్డి,పలుగుచెరువు మహేష్,జాలిగం చిత్తారి, జయప్రకాష్,రగడంపల్లి శ్రవణ్,జర్నలిస్టులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ పోచమ్మ దేవాలయం 19వ వార్షికోత్సవ వేడుకలు

## వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న

## భారతీయ జనతా పార్టీ గోల్కొండ ఇంచార్జ్ వై.శ్రీధర్

**రాజేంద్రనగర్,జులై09(నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ లోని శ్రీమాతా పోచమ్మ దేవాలయం 19వ వార్షికోత్సవ ఉత్సవాల కార్యక్రమాలలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని భారతీయ జనతా పార్టీ గోల్కొండ ఇంచార్జ్ వై.శ్రీధర్ అన్నారు.అందులో అమ్మవారి దర్శనం చేసుకొని వారి యొక్క ఆశీస్సులు పొందడం జరిగింది.ప్రతి సంవత్సరం అమ్మవారి వార్షికోత్సవ కార్యక్రమాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తూ ఉంటారు.ఉదయం సునమస్తే కార్యక్రమం నుంచి మధ్యాహ్నం ప్రసాదం,రాత్రి భజన కార్యక్రమం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.రాంబాబు,యాదమ్మ యాదవ్,ఉమామహేశ్వరి,అండాలు,కమల, తదితరులు పాల్గొన్నారు.



# మద్యానికి బానిసై భార్యపై కొడవలితో భర్త దాడి: మహిళకు తీవ్ర గాయాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 9(నమస్తే ఉదయం)**

మద్యానికి బానిసైన ఓ భర్త క్షణికావేశంలో కట్టుకున్న భార్యపైనే కొడవలితో దాడికి పాల్పడిన ఘటన బుధవారం సాయంత్రం మల్దకల్ మండలం మల్లెందొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మల్లెందొడ్డి గ్రామానికి చెందిన తిమ్మప్ప అనే వ్యక్తి మద్యానికి బానిసై, తరచూ భార్య మహేశ్వరితో గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రానికి మద్యం తాగడానికి భార్యను డబ్బులు అడగగా ఇవ్వకపోవడంతో భార్యాభర్తల మధ్యలు గొడవపడారు. దీంతో మద్యం మత్తులో ఉన్న తిమ్మప్ప తీవ్ర ఆగ్రహానికి లోనై, ఇంట్లోని కొడవలితో భార్య మహేశ్వరి తలపై బలంగా దాడి చేశాడు. ఈ దాడిలో మహేశ్వరి తలకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ ఆమె పరిస్థితి విషమించడంతో, మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు బాధితురాలిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# పశువైద్య శస్త్ర చికిత్స విధానంలో ఎస్సీ విద్యార్థులకు శిక్షణ

**బుద్వేల్, జూలై 9 (నమస్తే ఉదయం)**

పోటీ ప్రపంచంలో పశువైద్య విద్యార్థులు పాఠ్యాంశ పరిజ్ఞానంతో పాటు శస్త్ర చికిత్స లో ప్రాయోగిక నైపుణ్యాలను కూడా తప్పనిసరిగా అలవర్చుకోవాలని పీవీ నర్సిం హ్మారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాశ్ అన్నారు. పీవీ నర్సింహ్మారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ పశు వైద్య కళాశాల పశువైద్య శస్త్రచికిత్స, రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో బీవీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న షెడ్యులు క్యాస్ట్ విద్యార్థులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) షెడ్యుల్లు క్యాస్ట్ సబ్ ప్లాన్ లో బాగంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాశ్ మాట్లాడుతూ, కంపానియన్ జంతువుల


పశువైద్య కళాశాలలో జరిగిన శిక్షణ కార్యక్రమం లో పాల్గొన్న విద్యార్థులతో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాష్

వైద్యంలో పెరుగుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు స్వయం ఉపాధి దిశగా కూడా ముం దుకు సాగాలన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు భవిష్యత్తులో ఉత్తమ పశువైద్య నిపుణులుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర


విద్యార్థులనుదేశించి మాట్లాడుతున్న డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాష్

పోషిస్తాయని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ ఫ్యాకల్టీస్ డాక్టర్ ఎం ఉదయ్ కుమార్, పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి మాధురి, శిక్షణ కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ జె రాధాక్రిష్ణారావు, డాక్టర్ డి దినేశ్ లు పాల్గొన్నారు.


హత్యాయత్నం కేసులో అరెస్ట్ చేసిన నిందితులు


స్వాధీనం చేసుకున్న కత్తులు

# కలసి పనిచేయగా వచ్చిన డబ్బులు ఇవ్వమని అడిగితే కత్తులతో దాడి చేసి గాయపరిచిన ఇద్దరు యువకుల అరెస్ట్

**బుద్వేల్, జూలై 9 (నమస్తే ఉదయం)**

ముంబాయి లో కలసి పనిచేసిన సమయంలో తన జీతం డబ్బులు కూడా తీసుకున్నావని, వాటిని ఇవ్వమని అడిగినందుకు ఓ వ్యక్తి పై స్నేహితునితో కలసి కత్తులతో దాడి చేసి గాయపరిచిన పాత నేరస్థునితో పాటు అతనికి సహకరించిన స్నేహితుణ్ణి అత్తాపూర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి. సులేమాన్ నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ పాశు, అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ అప్తాబ్ అలియాస్ అప్పు (24) లు 2026 మే లో డ్రైవర్లుగా పనిచేయడానికి ముంబాయి వెళ్లారు. అక్కడ షేక్ మోబిన్ దగ్గర పనికి చేరారు. ఆ తర్వాత తిరిగి ఇంటికి వచ్చేసారు. ముంబాయి లో తనకు రావాల్సిన డబ్బులను షేక్ మోబిన్ తన స్నేహితుడైన సయ్యద్ అప్తాబ్ అలియాస్ అప్పు కు ఇచ్చానని చెప్పాడు. ఇం టికి వచ్చిన తర్వాత సయ్యద్ పాశు అప్తాబ్ ను డబ్బులు ఇవ్వమని అడిగాడు .దానికి ఆయన ఇవ్వకపోవడంతో ఈ నెల 6వ తేదీన అప్తాబ్ కు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వమని గట్టిగా అడిగాడు. దీంతో ఆగ్రహం తెచ్చుకున్న సయ్యద్ అప్తాబ్ తన స్నేహితుడు తలాబ్ కట్ట కు చెందిన అక్బర్ ఖాన్ (28) తో కలసి ఈ నెల 7వ తేదీన కత్తులతో సయ్యద్ పాశు పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ కేసు ను నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ కె రవి, అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావు లు తమ బృందంతో ఇద్దరు నిందితులు సయ్యద్ అప్తాబ్ అలియాస్ అప్పు, ఆక్బర్ ఖాన్ లను అరెస్ట్ చేశారు. సేమాబు చేసుకున్నా రాజంద్రనగర్ టోన్కవార్స్ ఇని స్పష్టం కార 5 6 బావా ఇకొ 0, అత్తాపూలు ఇనస్సాక్షం నాగశ్వర రావు లు తమ బృందంతో ఇద్దరు నిందితులు సయ్యద్ అప్తాబ్ అలియాస్ అప్పు, అక్బర్ ఖాన్ లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు కత్తులు, రెండు సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు.



# శోభన కాలనీ ఆటో స్టాండ్ వద్ద కూలిన చెట్టును తొలగించిన డిఆర్ఎఫ్ టీం

## మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ చొరవతో తక్షణ చర్యలు

**కూకట్ పల్లి, జూలై 9 (నమస్తే ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ శోభన కాలనీలోని ఆటో స్టాండ్ వద్ద పెద్ద చెట్టు కుంగిపోయి రోడ్డుపై అడ్డంగా పడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ విషయాన్ని స్థానిక ఆటో యూనియన్ నాయకులు ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే డిఆర్ఎఫ్ టీంకు ఫిర్యాదు చేసి స్పందించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ చొరవతో డిఆర్ఎఫ్ టీం వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని చెట్టు కొమ్మలను తొలగించడంతో ట్రాఫిక్ యథావిధిగా పునరుద్ధరించబడింది. ఈ సహాయానికి గాను స్థానిక ఆటో స్టాండ్ నాయకులు, స్థానికులు మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సలావుద్దీన్, రాజు, నరేష్ పాల్గొన్నారు.




# మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి

## మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి

## వన మహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 9(నమస్తే ఉదయం)**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో కార్యక్రమంలో భాగంగా గురువారం గద్వాల మున్సిపాలిటి పరిధిలోని 3 వార్డులో కౌన్సిలర్ నాగులు యాదవ్ ఆధ్వర్యంలో వేణుకాలనీ పార్కులో మొక్కలు నాటారు. వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే సరైన సమయంలో వర్షాలు పడాలి అలా జరగాలంటే ప్రతీ ఒక్క రూ మొక్కలను నాటాలని వారు పిలిపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేణు కాలనీ ప్రెసిడెంట్ శేషంపల్లి నర్సింహులు గద్వాల మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శ్రీకాంత్, కౌన్సిలర్లు వేదవతి, వెంకటలక్ష్మమ్మ, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో ముగిసిన టియుడబ్ల్యుజె మహాసభ







**ఎన్నికైన కార్యవర్గం**

**పటాన్ చెరు, జూలై 9 ( నమస్తే ఉదయం)**

టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా మహా సభ సంగారెడ్డిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జరిగిన కార్యవర్గం ఎన్నికలో తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు (ఐజెయు) సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్, ఉపాధ్యక్షునిగా శ్రీనాథ్, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శిగా చెన్న బసవేశ్వర్, జాయింట్ సెక్రటరీగా భూపాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన బసవేశ్వర్, భూపాల్ రెడ్డిలకు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గంలో చోటు కల్పించారు. తమపై నమ్మకంతో పదవులు అప్పగించిన రాష్ట్ర, జిల్లా టీయూడబ్ల్యుజే ఐజేయూ కార్యవర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం బలోపేతానికి తమ శాయశక్తులా కృషి చేస్తామన్నారు. అందరి సహకారంతో సంఘం పట్ల నిబద్ధతో పనిచేస్తామని చెప్పారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి.

**విద్యార్థులను ఇబ్బంది పెట్టే ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు.**

**విశ్రాంత ఉపాధ్యాయులు తమ సహకారాన్ని అందించాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 9(నమస్తే ఉదయం)**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని, అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది, ప్రస్తుతం విద్యార్థుల ఎన్రోల్మెంట్ ఆఫ్లైన్, ఆన్లైన్ నివేదికలను అందజేయాల్సిందిగా ఆదేశించారు. ఎన్రోల్మెంట్ పెంచే టాప్ ముగ్గురు డిఈఓలకు ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో పతకాలను, ఎంఈఓలకు జిల్లా స్థాయిలో ప్రోత్సాహకాలు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు వస్తున్న విద్యార్థులకు ప్రైవేటు యాజమాన్యాలు బోనఫైడ్, టీసీలు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే సహించేది లేదని తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపార్ నమోదు పెరగాలని, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు రెన్యువల్, కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సహకరించాలన్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో అంగన్వాడి కేంద్రాల చిన్నారులు పెద్ద సంఖ్యలో చేరేలా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం రుచికరంగా వండించాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యాబోధన చేసేందుకు విశ్రాంత ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు రావచ్చని, ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలు పెరిగిన పాఠశాలలకు విద్యా వాలంటీర్లను నియమిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, డీఈవో విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం తప్పని నిరీక్షణ

**కాసులిస్తేనే ధృవీకరణ పత్రాలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 9(నమస్తే ఉదయం)**




విద్యా సంస్థల్లో ప్రవేశాలకైనా ఉద్యోగాల్లో చేరేందుకైనా కుల, ఆదాయ, స్థానిక ధృవీకరణ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈ అవసరాన్ని అవకాశంగా తీసుకుంటున్న రెవిన్యూ సిబ్బంది కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం కారణంగా సకాలంలో చేతికందక ప్రజానీకం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. అమ్యామ్యాల కోసమే కొందరు సిబ్బంది కావాలనే దరఖాస్తులను పెండింగ్లో ఉంచుతున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతి పనికి రేటు నిర్దేశిస్తుండడంతో కేటిదొడ్డి మండల రెవిన్యూ కార్యాలయ అక్రమార్జనకు అడ్డాగా మారుతున్నాయన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

**అధికారులు అలసత్వం**

పౌర సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది దళారులతో కుమ్మక్కవుతున్నట్లు టాక్ విన్పిస్తోంది. మీ సేవ ద్వారా వెళ్లే దరఖాస్తులను పరిశీలించి ధృవీకరణ పత్రాలను జారీ చేయాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. దరఖాస్తుదారుడు నేరుగా వెళ్తే నిర్ధాక్షిణంగా దరఖాస్తులను రిజెక్ట్ చేస్తున్నారు. అదే దళారుల ద్వారా వెళ్తే వెంటనే పని అయిపోతుందన్న ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. తహసీల్దార్ పర్యవేక్షణ సైతం అంతంత మాత్రంగానే ఉంటుండడంతో తహసిల్దార్ కార్యాలయాల్లో సిబ్బంది ఆడిందే ఆట అన్నట్లుగా సాగుతోంది. కేటిదొడ్డి తహసీల్దార్ కరుణాకర్ ను వివరణ కోరగా జీపీఓలు సర్ ప్రక్రియలో కార్యక్రమంలో బిజీగా ఉండటం వల్ల ఆలస్యం జరుగుతోంది. అయిన కూడా విద్యార్థుల కుల అదాయం ఎక్కడ జాప్యం రాకుండా వెంటనే అప్రూవ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధనకు బంద్ విజయవంతం చేయాలి

**విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యాసంస్థల బంద్‌కు డీవైఎఫ్ఐ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు**

**మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి చైతన్య**

కూకట్ పల్లి, జూలై 9 (నమస్తే ఉదయం) రాష్ట్రంలో విద్యారంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో విద్యార్థుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు రేపు చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు జిల్లా సహాయ కార్యదర్శి చైతన్య విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, విద్యను రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుగా కాకుండా లాభాల కోసం నడిచే వ్యాపారంగా మార్చడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో వేలాది అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని అన్నారు. విద్యార్థుల హాస్టళ్లలో నాసిరకం భోజనం, తాగునీటి కొరత, పారిశుద్ధ్య సమస్యలు, భద్రతా లోపాలు, సరిపడా వసతి లేకపోవడం వంటి సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.




స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు చదువులు కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన అన్నారు. పేద కుటుంబాలకు ఉన్నత విద్య భారంగా మారిందని, విద్యార్థులు అప్పుల పాలవుతున్న పరిస్థితి ఆందోళనకరమని పేర్కొన్నారు. నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యను బలహీనపరచే చర్యలను విరమించి, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, ఖాళీ అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య, హాస్టల్ సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన ఈ బంద్ ప్రజా ప్రయోజనాల కోసమేనని, అందువల్ల విద్యార్థులు, యువజనులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు బంద్‌ను విజయవంతం చేసి తమ సంఘీభావాన్ని తెలియజేయాలని జిల్లా సహాయ కార్యదర్శి చైతన్య పిలుపునిచ్చారు. విద్య అనేది కొందరికి అమ్ముకునే వస్తువు కాదు... ప్రతి విద్యార్థికి అందాల్సిన రాజ్యాంగ హక్కు. ఆ హక్కు పరిరక్షణ కోసమే ఈ ఉద్యమమని ఆయన పేర్కొన్నారు.

## 27 ఏళ్లకే ఏఎంసీ నంగునూర్ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్

**యువతకు ఆదర్శంగా నిలుస్తున్న పవన్ కుమార్**

**సిద్దిపేట జిల్లా, నంగునూర్ జులై 09 (నమస్తే ఉదయం)**

రాజకీయాల్లో రాణించాలంటే డబ్బు, పలుకుబడి, రాజకీయ వారసత్వం తప్పనిసరి, అన్న భావన రోజు రోజుకు బలపడుతున్న,ఈ రోజుల్లో సాధారణ కుటుంబం నుంచి వచ్చిన యువ నాయకుడు , తన సేవా భావంతో ప్రజల మనసును గెలుచుకొని రాష్ట్రంలోనే అతి చిన్న వయసు 27 ఏళ్లకే నంగునూరు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ గా నంగునూరు మండల కేంద్రానికి చెందిన సాదుల పవన్ కుమార్, సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నరు. సాదుల పవన్ కుమార్

**పవన్ పాఠశాల నుంచే నాయకత్వ లక్షణాలు**

సాదుల పవన్ కుమార్ నంగునూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.సి చదివిన పవన్ కుమార్,ఎంఏ సోషలాజీ( సమాజ శాస్త్రం) ఎల్.ఎల్.బి పూర్తి చేశారు. పవన్ కుమార్, ఎన్.ఎస్.యూ.ఐ యూత్ కాంగ్రెస్ లో చురుగ్గా పనిచేసి పవన్ కుమార్ 2016లో ఎన్. ఎస్ యూ.ఐ కాలేజ్ అధ్యక్షులుగా. 2019లో యూత్ కాంగ్రెస్ సిద్దిపేట అసెంబ్లీ గా 2024 లో యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జనరల్ సెక్రెటరీగా పని చేశారు.వారి తండ్రి సాదుల ఆత్మరాములు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ న్యాయవాది,ఆయన సిద్దిపేట జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి సాదుల రాణి, కాంగ్రెస్ పార్టీ నుంచి నంగునూర్ సర్పంచ్ గా ఎన్నికైన గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. ప్రస్తుతం యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా పవన్ కుమార్ ఉన్నారు. ఉపాధ్యాయులు,మరియు అధ్యాపకులు,చదువుతోపాటు సమాజంపై బాధ్యత కూడా చెప్పారని గుర్తు చేసుకుంటారు. “చదువుతోనే పేదరికం దూరం చేస్తుందని నమ్ముతారు” విద్యార్థి దశ నుండే యువ నాయకుడిగా పేరు తెచ్చుకున్న సాదుల పవన్ కుమార్.



**చిన్నప్పటి నుంచే సేవా కార్యక్రమాలు**

సాదుల పవన్ కుమార్, చిన్నప్పటి నుంచే సేవచేసే గుణం కలిగిన యువ నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఎవరికైనా కష్టం వచ్చిందంటే నేను ఉన్నాను. అన్న భావనతో అతనికి సహాయం చేయడం ఆయనకు అలవాటు.

**ఏఎంసీ వైస్ చెర్మన్ సాదుల పవన్ కుమార్ మాటల్లో**

నేటి యువతలో చాలామంది గ్రామాలు విడిచి పట్టణాలకు వెళ్లాలని భావిస్తారు. కానీ పవన్ కుమార్,మాత్రం తన గ్రామానికి సేవ చేయాలని అంకితభావంతో గ్రామ ప్రజల మధ్య ఉండి సేవ చేయాలని తపన కలిగిన యువ నాయకుడు. గ్రామ ప్రజలతో తోడుగా ఉంటే , తనకు నిజమైన ఆనందం ఉందని “ప్రజలే నా బలం బలగం “ అని చెబుతున్నారు. గ్రామ అభివృద్ధి కొరకు, సీనియర్ నాయకులను కలుపుకొని పార్టీ కార్యకర్తలను కలుపు కొని ఎంతటి వారినైన సంప్రదించి ప్రత్యేక నిధులు తీసుకొస్తానని, ముఖ్యంగా రైతుల అభివృద్ధికై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. డబ్బు లేకపోయినా రాజకీయ వారసత్వం లేకపోయినా ప్రజల కోసం నిజాయితీగా పని చేస్తే విజయం సాధించవచ్చు అని, సాదుల పవన్ కుమార్అన్నారు. తన తండ్రి ఆత్మ రాములు ఆశయాలకు అనుగుణంగా అడుగు వేస్తూ పట్టుదలతో ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ఏఎంసీ వైస్ చైర్మన్ పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాను. అని ఈ రోజుల్లో అందరూ డాక్టర్ ఇంజనీరు టీచర్ కావాలనుకుంటారు.కానీ పవన్ మాత్రం ఒక మంచి నాయకుడు కావాలని అన్నారు.



ప్రజాస్వామ్యంలో ఏమన్నా చేయాలంటే నాకు అర్థమైంది. ఏమిటంటే ఒక డాక్టర్ అయితే వారికి ప్రయోజనం, ఒక ఇంజనీర్ విదేశాలకు వెళ్తే తండ్రికి ప్రయోజనం, అదే ఒక టీచర్ అయితే వారికి వారి కుటుంబానికి ప్రయోజనం దాటి చేయుటం లేదు. కానీ ఒక రాజకీయం తప్ప మన గ్రామానికి మన మండలానికి మన జిల్లాకు మన రాష్ట్రానికి ఏమన్నా చేయాలంటే విశాలమైన అవకాశాలు విస్తరణ అవకాశాలు ఒక రాజకీయాల్లో మాత్రమే సాధ్యమైతదని నమ్మిన వ్యక్తి పవన్.రాష్ట్రంలో అతి చిన్న వయసులో తనకు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.తనపై నమ్మకంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి తనను ఎంపిక చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు సహకరించిన పెద్దలకు కార్యకర్తలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



## పాపిరెడ్డి నగర్ వీరాంజనేయ శివాలయ ఆలయంలో శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి జన్మదిన వేడుకలు

**హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తన వంతు సేవలు అందించాలి**

**ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎవరు చెడు మార్గంలో వెళ్లకుండా ఉంటారు**

**పీఏసీ చైర్మన్ శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**

**కూకట్ పల్లి, జూలై 9 (నమస్తే ఉదయం)**

వేంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీ లో జరిగిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ చాముండేశ్వరీ అనుగ్రహ పీఠాధిపతులు శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి జన్మదిన వేడుకల లో ముఖ్యఅతిథిగా పి ఎస్ సి చైర్మన్ అరికెపూడి గాంధీ స్థానిక నాయకులతో పాల్గొని 200 మంది మహిళ సోదరీమణులకు చీరలను, దుప్పట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పి ఎస్ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ చాముండేశ్వరీ అనుగ్రహ పీఠాధిపతులు శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి కి జన్మదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, ఆయన జన్మదినం పురస్కరించుకొని పలు రాష్ట్రాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తన వంతు సేవలు అందించాలని, ఆ యొక్క సేవలో ప్రతిఫలం వచ్చే తరానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియచేశారు. ప్రస్తుత సమాజంలో సేవా కార్యక్రమాలకు ఎన్నో ధార్మిక సంఘాలు సహకారం అందిస్తున్నారు. అటువంటి ధార్మిక కార్యక్రమాలను ఎన్నో సంవత్సరాలుగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీశ్రీ శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి సేవలందిస్తున్నారని వారి సేవలను భావితరాలను దృష్టిలో ఉంచుకుని వారి మార్గంలో యువత సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని అయన పిలుపునిచ్చారు. బాలానగర్ లో జరిగిన ఒక కార్యక్రమంలో సివి రామన్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు మహేంద్రవాడ వెంకటేశ్వర అధ్యక్షత వహించి ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరు చెడు మార్గాలకు పయనించకుండా మంచి మార్గాల్లో నడుస్తారని అందువల్ల ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ, సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనేవారు ఎప్పటికీ చెడు మార్గాల్లో ఉండరని అన్నారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు సుమారు 200 మందికి పైగా దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కోట రాజేశ్వరి, భానుమతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, రాజ్యశ్రీ, పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, నాయకులు పోతుల రాజేందర్, చెర్ల సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి నర్సింహులు, తాటి కిరణ్, వనం ఆంజనేయులు, మాదాసు అనంత రాములు, సత్యనారాయణ, శ్రీకాంత్, లక్ష్మీ, అరుణ, సులోచన, మనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణలోనే నంబర్-1గా తీర్చిదిద్దుతాం

**రూ.21 కోట్లతో 172 దుకాణాల నిర్మాణం వేగవంతం..**

**మేకల మండి, చేపల మార్కెట్, స్లాటర్ హౌస్, ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుకు కార్యాచరణ.. అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, జూలై 9 (నమస్తే ఉదయం)**

వ్యవసాయం, వాణిజ్యం, ఉపాధి రంగాలకు కొత్త ఊపిరి పోస్తూ పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణ రాష్ట్రంలోనే అత్యాధునిక, ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. రైతులు, వ్యాపారులు, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికతో మార్కెట్ యార్డు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.గురువారం పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. నిర్మాణాల నాణ్యత, పనుల పురోగతిపై అధికారులను ప్రశ్నించి, నిర్ణీత గడువులోగా అత్యుత్తమ ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో 12 సంవత్సరాల క్రితం పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు జరిగిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి దశలవారీగా నిధులు మంజూరు చేస్తూ మార్కెట్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.ప్రస్తుతం 21 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 172 దుకాణాల నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందని తెలిపారు. పనులు పూర్తయ్యాక లైసెన్స్ కలిగిన వ్యాపారులకు దుకాణాలను కేటాయించడంతో పాటు కొత్త వ్యాపారులకు కూడా లైసెన్సులు మంజూరు చేసి వ్యాపార విస్తరణకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.ప్రస్తుతం మార్కెట్‌కు పన్నులు, కిరాయిలు, టెండర్ల ద్వారా ఏటా సుమారు రూ.6 కోట్ల ఆదాయం సమకూరుతోందని, దీనిని మరింత పెంచేందుకు కొత్త ఆదాయ వనరులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ యార్డులో ఆధునిక మేకల మండి, చేపల మార్కెట్, అత్యాధునిక స్లాటర్ హౌస్, ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే రోజువారీ కూరగాయల విక్రయాలు నిర్వహించే చిరు వ్యాపారులకు ప్రత్యేక షెడ్లు నిర్మించి మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.మార్కెట్‌లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి పరిశుభ్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.ప్రభుత్వ నిధులతో పాటు మార్కెట్ స్వంత ఆదాయాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణలోనే అత్యుత్తమ, ఆదర్శవంతమైన, నంబర్-1 మార్కెట్‌గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కార్యదర్శి సునీల్, మాజీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వ్యాపారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.